

సాక్షి
బాపట్ల
బుధవారం । 8 । మార్చి । 2023



రేపటికి ముందడుగు

న్యూస్‌రీల్

పొడా వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డి



సాక్షి, నరసరావుపేట: పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) వైస్ చైర్మన్‌గా డాక్టర్ గజ్జెల శ్రీనివాసరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మాతృసంస్థ పశుసంవర్ధక శాఖలో ఏడీ స్థాయిలో పని చేస్తున్న శ్రీనివాసరెడ్డి డిప్యూటేషన్‌పై ఈ పోస్టులో పనిచేయనున్నారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో డ్వామా పీడీగా, జెడ్పీ సీఈఓగా శ్రీనివాసరెడ్డి ఉత్తమ సేవలు అందించి ప్రశంసలు పొందారు.

రీ-సర్వేతో భవిష్యత్ తరాలకు మేలు

జేసీ రాజకుమారి



గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం భవిష్యత్ తరాలకు ఒక వరమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. 5 గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తి చేసిన సర్వే శాఖాధికారులు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో వాటి వివరాలు సమర్పించారు. జేసీ మాట్లాడుతూ ఈ ఏడాది చివరినాటికి రీ సర్వే పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని చెప్పారు. మేడికొండూరు మండలంలోని పొనుగుపాడు కండ్రిక, వట్టిచెరుకూరు మండలంలోని లేమల్లెపాడు గ్రామాల్లో సెక్షన్ 13 నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు.

భావన్నారాయణుని తాకిన సూర్యకిరణాలు



చినగంజాం: పెదగంజాం భావన్నారాయణ స్వామి ఆలయంలో మంగళవారం సూర్యకిరణాలు స్వామి మూలవిరాట్‌ను పాక్షికంగా తాకాయి. ప్రతి ఏడాది మార్చి, సెప్టెంబర్ నెలల్లో ఈ సుందర దృశ్యం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచుతుంది. మంగళవారం నుంచి స్వామి వారిని కిరణాలు తాకడం ప్రారంభం కాగా రానున్న రెండు మూడు రోజుల్లో స్వామి వారిని పూర్తిగా అభిషేకించడాన్ని భక్తులు చూడవచ్చని ఆలయ అర్చకులు తెలిపారు.

యార్డుకు 1,10,256 బస్తాల మిర్చి రాక




కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,10,256 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,07,643 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.26,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 78,674 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

9, 10 తేదీల్లో 'ఎకనామిక్స్' జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారతీయ ఆర్థిక వ్యవస్థ-ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అనే అంశంపై ఈ నెల 9, 10 తేదీల్లో జాతీయ సదస్సు జరుగుతుందని ఎకనామిక్స్ విభాగాధిపతి ఆచార్య కె.మధుబాబు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దేశంలోని పలు యూనివర్సిటీలు, ఆర్థిక పరిశోధన కేంద్రాల నుంచి అధ్యాపకులు, ఆర్థికవేత్తలు పాల్గొని పరిశోధన పత్రాలు సమర్పించనున్నారన్నారు.

ఆమెకు అగ్రభాగం

- మహిళా సాధికారతకు జగన్ సర్కార్ కృషి
- పలు పథకాలతో ఆర్థిక ప్రగతి
- మహిళలకు రూ.1887.71 కోట్లు



సాక్షి ప్రతినిధి, బాపట్ల: మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను అమలు చేస్తున్న అన్ని పథకాలలో మహిళకు పెద్దపీట వేశారు. అన్ని సంక్షేమ పథకాలకు మహిళలను ప్రధాన లబ్ధిదారులుగా ఎంపిక చేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించి పాలనలోనూ సగభాగం కల్పించారు.

బ్యాంకు లింకేజీ ద్వారా సాయం

రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత లక్ష్యంగా బ్యాంకుల ద్వారా వారి ఆర్థిక ప్రగతికి తోడ్పాటునిస్తోంది. బ్యాంకు లింకేజీ ద్వారా 19000 మందికి గడిచిన మూడున్నరేళ్లలో రూ.914.33 కోట్లు రుణాలుగా అందించింది.

స్త్రీనిధి ద్వారా..

స్త్రీనిధి పథకం ద్వారా 28,402 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.121.93 కోట్ల రుణ సాయాన్ని అందించింది.

వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం

మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసాను కల్పించేందుకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రభుత్వం అమలుచేస్తోంది. జిల్లాలో 31,775 స్వయం సహాయక సంఘాలకు రూ.123.86 కోట్లు పంపిణీ చేసింది. ఈ పథకం ద్వారా బ్యాంకులో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లిస్తున్న స్వయం సహాయక సంఘాలకు వడ్డీ రాయితీని ప్రభుత్వమే భరిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 27,643 గ్రూపులకు రూ.476.74 కోట్లు అందించింది.

వైఎస్సార్ చేయూత పథకం

45-60 ఏళ్ల మధ్య వయస్సుగల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల మహిళలకు ప్రభుత్వం ప్రతి ఏటా 85,846 మందికి రూ.160.96 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ఈ లెక్కన నాలుగేళ్లలో రూ.75 వేలను ఉచితంగా అందిస్తోంది. ఉన్నతి పథకం ద్వారా 910 మందికి రూ.4.18 కోట్లు, వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా 134 మందికి రూ.1.29 కోట్లు పంపిణీ చేశారు. జగనన్న తోడు పథకం ద్వారా 9255 మందికి రూ.9.02 కోట్లు, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ ద్వారా 2,349 మందికి రూ.10.69 కోట్లు పంపిణీ చేశారు.

మహిళల పేరుతోనే నివేశన స్థలాలు, పక్కా గృహాలు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహ నిర్మాణ పథకంలో మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఇంటి స్థలాలతో పాటు గృహాలను సైతం వారి పేరుతోనే నిర్మిస్తోంది. జిల్లాలో 18,491 మంది లబ్ధిదారుల కోసం రూ.64.71 కోట్లు ఖర్చు చేస్తోంది.

చదువుతో ఉన్నత స్థాయికి



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళలందరికీ శుభాకాంక్షలు. మహిళలు నేడు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుకు సాగుతుండటం సంతోషించదగ్గ పరిణామం. ఇది మరింతగా పెరగాలి. మహిళలు అధైర్యాన్ని పారదోలి ధైర్యంతో ముందుకు సాగాలి. తొలుత చదువుపై దృష్టి పెట్టాలి. చదువు మనిషిని ఉన్నత శిఖరానికి చేరుస్తుంది. సమస్యలకు కుంగిపోరాదు. మనోధైర్యంతో నిలబడాలి. ఆత్మవిశ్వాసం మనల్ని విజయతీరాలకు చేరుస్తోంది.

– కె.విజయకృష్ణన్, జిల్లా కలెక్టర్

పట్టుదలతో పోరాడినప్పుడే విజయం సాధ్యం



మహిళలు ఎంపిక చేసుకున్న ఏ రంగంలో అయినా పట్టుదలతో పోరాడినప్పుడే విజయాన్ని సాధించగలరు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి. ప్రతిభ ఉన్న రంగంలో మహిళలు ఎదిగే విధంగా తోడ్పాటు ఇస్తామని ప్రతిన పూనడమే మాకిచ్చే కానుక. మగువకు మేలు చేసేలా ప్రభుత్వం సంకల్పిస్తున్న తీరు ప్రశంసనీయం. భవిష్యత్తులో మహిళా అభ్యున్నతి కోసం అందరూ చేయూతనివ్వాలని కోరుకుంటున్నా.

– వి.శ్రీలక్ష్మి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్

ఎందులోనూ తక్కువేమీ కాదు



చాలా సందర్భాల్లో ఒక మాట వింటుంటాం.. స్త్రీలు పురుషులకన్నా ఏ మాత్రం తక్కువకాదు. వాళ్లతో సమానంగా స్త్రీలు కూడా అన్ని పనులు చేయగలరు. అసలు స్త్రీ పురుషుల్లో ఒకరు ఎక్కువని, ఒకరు తక్కువని ఎందుకు అనుకోవాలి. ప్రకృతిలో సహజసిద్ధంగా స్త్రీ పురుషులిద్దరూ సమానమే. ఎవరి సొంత ప్రతిభ శక్తి వారికుంది. మహిళలకు సంవత్సరంలో ఒక రోజు అనేది ఏంటి?, సంవత్సరంలోని 365 రోజుల్లో మహిళలది కాదు అనే ఒక గంటకానీ, రోజుకానీ ఉందా..?

– జి.లక్ష్మి, జిల్లా రిజిస్ట్రార్, రచయిత



మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి దివ్య రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

దివ్యోత్సవం.. రథోత్సవం

- పోటెత్తిన భక్తజనులు
- కిటకిటలాడిన మంగళగిరి వీధులు
- జై నారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మార్మోగిన మంగళాద్రి
- రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి

మంగళగిరి: నగరంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహస్వామి దివ్య రథోత్సవం మంగళవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. దివ్యమంగళ స్వరూపులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో మంగళాద్రి భక్తులతో పోటెత్తింది. నగర వీధులన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకున్న స్వామి వారు మంగళవారం ఉదయం బంగారు గరుడోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం బ్రాహ్మణ సమారాధన అనంతరం 3 గంటలకు ఉభయదేవేరులతో స్వామి వారు దివ్యరథాన్ని అధిరోహించారు. అలంకరణ, పూజల అనంతరం 4 గంటలకు స్వామి దివ్య రథం భక్తుల గోవింద నామస్మరణ మధ్య బయలుదేరగా జైనారసింహా.. జైజై నారసింహా నినాదాలతో మంగళాద్రి భక్తిపారవశ్యంలో ఓలలాడింది. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. గాలిగోపురం వద్ద నుంచి బయల్దేరిన రథోత్సవం మెయిన్ బజార్‌లోని మిద్దె సెంటర్ ఆంజనేయస్వామి ఆలయం వరకు చేరుకుని అక్కడ పూజల అనంతరం తిరిగి అదే మెయిన్ బజార్‌లో గాలిగోపురం వద్దకు చేరుకుంది. భక్తులు భారీగా తరలిరావడంతో పలురోడ్లు కిటకిటలాడాయి. ఉత్సవ కైంకర్యపరులుగా మాడభూషి వేదాంతచార్యులు వ్యవహరించగా ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు తాగునీటి ప్యాకెట్లు, అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఒకేసారి 17 వైద్య కళాశాలలు

- ఏప్రిల్ 1 నుంచి పీజీ వైద్య విద్యార్థులకు సీఎంఈ
- హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జి
- ఘనంగా గుంటూరు వైద్య కళాశాల కాలేజీడే వేడుకలు



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతిని సన్మానిస్తున్న డాక్టర్ బాబ్జి తదితరులు

గుంటూరు మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 17 వైద్య కళాశాలలను తొలిసారిగా ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కోరుకొండ బాబ్జి అన్నారు. గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో మంగళవారం రాత్రి వైద్య కళాశాల కాలేజ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ పీజీ వైద్య విద్యార్థులకు ప్రాంతీయ నిరంతర వైద్య విద్య కార్యక్రమాలను ఏప్రిల్ 1 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. వైద్య విద్యను బలోపేతం చేసేందుకు వైద్య కళాశాలల్లో ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.

మానవతా దృక్పథం అవసరం

సస్ఫైర్ బోస్ అండ్ జాయింట్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ ఏవీ గురువారెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తిలో ఉన్నవారు మానవతా దృక్పథంతో పాటు పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలని చెప్పారు.

వైద్య కళాశాల చరిత్రలో స్వర్ణయుగం..

వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతిదేవి మాట్లాడుతూ నాడు - నేడులో భాగంగా కళాశాలలో ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ విభాగాల ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందన్నారు. వైద్య కళాశాల చరిత్రలో ఈ ఏడాది స్వర్ణయుగమని అభివర్ణించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి మాట్లాడుతూ మాతృ సంస్థను మరువకుండా కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జింఖానా కో-ఆర్డినేటర్లు డాక్టర్ బాలభాస్కరరావు, డాక్టర్ హనుమంతరావు కళాశాల అభివృద్ధికి జింఖానా చేస్తున్న సేవలను వివరించారు. ఎంసీహెచ్ నిర్మాణానికి రూ.86 కోట్లు విరాళాలు సేకరిస్తున్నామని, పూర్వ విద్యార్థులంతా ముందుకు రావాలని కోరారు. వైద్య కళాశాల ఈ-సావనీర్‌ను డాక్టర్ బాబ్జి ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి, డాక్టర్ చంద్రకళ, పలువురు బోధనా సిబ్బంది, గుంటూరుకు చెందిన పలువురు సీనియర్ వైద్యులు, వైద్య విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పలు సాంస్కృతి కార్యక్రమాలతో వైద్య విద్యార్థులు అలరించారు.

వైభవంగా సాగర్‌మాత మహోత్సవం



విద్యుద్దీపాలంకరణలో సాగర్‌మాత దేవాలయాలు

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్‌లో మంగళవారం సాగర్‌మాత మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శాంతి, సమాధానం, ప్రేమ, కరుణను ప్రసాదించే సాగర్‌మాత భక్తుల పాలిట కల్పవల్లి అని గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో సమష్టి దివ్యబలిపూజ కార్యక్రమం నిర్వహించి జోసఫ్ ప్రసంగించారు. పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన సాగర్‌మాత (మరియమ్మ)ను భక్తివిశ్వాసాలతో పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని చెప్పారు. అనంతరం ఆలయాలు, జపమాల క్షేత్రాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం 5.30 గంటలకు సాగర్‌మాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్‌తో, 6.30 గంటలకు గురుశ్రీ జోసఫ్ తంబి అన్నెంతో దివ్యబలిపూజ, 10 గంటలకు గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్‌తో జపమాల, స్తుతి ఆరాధన, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 2 గంటలకు గురుశ్రీ గోపు జోసఫ్‌తో వాక్య పరిచర్య, స్వస్థత ప్రార్థనలు, సాయంత్రం 5.30 గంటలకు రెంటచింతల విచారణ గురువులు గురుశ్రీ ఏరువ బాలశౌరెడ్డితో జపమాల, తేరుప్రదక్షిణ, దివ్యబలిపూజ, 7.30 గంటలకు కొవ్వొత్తులతో తేరు ప్రదక్షిణ ఘనంగా జరిపారు.

భారీగా తరలివచ్చిన భక్తులు

సాగర్‌మాత మహోత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో విజయపురిసౌత్ కళకళలాడింది. రోడ్డుకు ఇరువైపుల తినుబండారాల కేంద్రాలు, ఫ్యాన్సీ షాపులు, వివిధ రకాలైన ఆటబొమ్మల దుకాణాలు వెలిశాయి. సాగర్‌మాత దేవాలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

ఉచిత వైద్య శిబిరాలు

సాగర్‌మాత దేవాలయానికి వచ్చే భక్తుల కోసం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు కేపీ చారి, కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సమృద్ధి ఫౌండేషన్, స్థానిక కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉత్సవ ప్రభ.. శింగరకొండ శోభ



విద్యుత్‌కాంతుల ధగధగలతో మెరిసిపోతున్న శింగరకొండ పరిసరాలు

- భక్తజన సంద్రంగా శింగరకొండ
- వైభవంగా తిరునాళ్ల
- ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ ప్రభలు
- 2 లక్షల మంది భక్తుల హాజరు
- 738 మంది పోలీసులతో బందోబస్తు



తిరునాళ్లలో కిక్కిరిసిన భక్తులు

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల అంగరంగ వైభవంగా జరుగుతోంది. ఆలయ పరిసరాలు భక్తజన సంద్రంగా మారాయి. వివిధ గ్రామాల నుంచి ఏర్పాటు చేసిన 11 విద్యుత్ ప్రభల వెలుగులతో క్షేత్ర పరిసరాలు కాంతులీనుతున్నాయి. ప్రభలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. దేవస్థాన నాలుగు రాజగోపురాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఏసీ సుభద్ర పర్యవేక్షించారు.

వైభవంగా రథోత్సవం

మంగళవారం రాత్రి ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణచైతన్య తన భార్య నీతూ సమేతంగా వచ్చి రథాన్ని లాగి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఏసీ సుభద్ర, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. సుమారు 2 లక్షల మంది స్వామివారిని దర్శించుకుని ఉంటారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. పలువురు వీఐపీలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రథాన్ని లాగుతున్న రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ చైతన్య దంపతులు

పోలీసు బలగాలతో పర్యవేక్షణ..

శింగరకొండ తిరునాళ్ల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముగ్గురు డీఎస్పీలు, 14 మంది సీఐలు, 42 మంది ఎస్‌ఐలు, 143 మంది ఏఎస్‌ఐలు, 238 మంది కానిస్టేబుళ్లు, 56 మంది మహిళా పోలీసులు, 184 మంది హోంగార్డులు, 58 మంది స్పెషల్ ఫోర్స్‌తో కలుపుకుని మొత్తం 738 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. బందోబస్తును చీరాల డీఎస్పీ శ్రీకాంత్, సీఐ రోశయ్య, ఉమెన్ ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, ప్రవీణ పర్యవేక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా భారీ వాహనాలను సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం అడ్డరోడ్డు, నుంచి మేదరమెట్ల పైలాన్ వైపునకు దారిమళ్లించారు. ప్రతి ప్రభ వద్ద పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

మహిళా సమగ్రాభివృద్ధే ధ్యేయం

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల సమగ్రాభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం పరిపాలన చేస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు బాల్య వివాహాల నిరోధంపై జిల్లా స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో మహిళల ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించి గౌరవప్రదమైన స్థానంలో నిలిపారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి రత్నకుమార్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

175 సీట్లు సాధ్యమే..

వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జోనల్ ఇన్‌చార్జి కన్నా



అచ్చంపేట: సీఎం జగన్‌మోహనరెడ్డి చెప్పినట్లు వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో 175కి 175సీట్లు సాధ్యమేనని పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన కన్నా హనుమంతరావు అన్నారు. మంగళవారం ఆయన అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడారు. పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం, చిగురుపాడు ఆర్ అండ్ ఆర్ సెంటర్‌కు చెందిన తనను మూడు జిల్లాలకు ఇన్‌చార్జిగా నియమించినందుకు సీఎం జగన్‌మోహనరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మూడున్నరేళ్లుగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందచేస్తున్న సీఎం పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని చెప్పారు. సంక్షేమ పథకాల రూపంలో ప్రతి ఇంటికి మేలు చేకూరిందన్నారు. మేలు చేసిన వారిని వదలి కీడు చేసేవారికి ప్రజలు ఎన్నడూ మద్దతు ఇవ్వరని చెప్పారు. ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలనే కాకుండా, ఇవ్వని ఎన్నో పథకాలను ప్రజల కోసం ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహనరెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారన్నారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని, తనపై పెట్టిన బాధ్యతను సమర్థవంతంగా నెరవేరుస్తానని కన్నా చెప్పారు. తనను ఈ స్థాయికి తీసుకువచ్చిన పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

15న ఎంహెచ్‌పీ కౌన్సెలింగ్

గుంటూరుమెడికల్: మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ (ఎంపీహెచ్‌ఏ) మేల్ పునర్విభజన కౌన్సెలింగ్ ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు తెలిపారు. పునర్విభజన సీనియార్టీ లిస్టును 7న విడుదల చేశామని, 10వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. 14న ఫైనల్ సీనియార్టీ జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

పారిశ్రామిక రంగంలో దేశానికి తలమానికంగా ఏపీ

రాష్ట్ర మంత్రి మేరుగ నాగార్జున



ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి కేక్ కట్ చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: పారిశ్రామిక రంగంలో రానున్న రోజుల్లో దేశానికే ఆంధ్రప్రదేశ్ తలమానికంగా నిలిచే విధంగా పరిశ్రమల స్థాపన కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎనలేని కృషి చేస్తున్నారని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. విశాఖలో ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతమైన సందర్భాన్ని పురస్కరించుకుని కొల్లూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి మంత్రి కేక్ కట్ చేసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిశితమైన పరిపాలనా దృష్టితో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు అవసరమైన కార్యాచరణను ప్రణాళికాబద్ధంగా అమలుచేయడంలో దిట్టగా వ్యవహరిస్తున్నారని కొనియాడారు. దేశంలోని ఉద్దండులైన పారిశ్రామికవేత్తలను ఒక చోటకు చేర్చి రాష్ట్రంలో పారిశ్రామిక రంగానికి ఉన్న అనుకూలతలు తెలియజేయడంతో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు రాష్ట్రానికి దక్కాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీలు కమ్మెల నాంచారమ్మ, జాలాది రూబేన్, యల్లమాటి మోహన్, రావర్ల నరేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వేమూరు మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, సర్పంచి ఉయ్యూరు అప్పిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, యలవర్తి సురేష్‌బాబు, అళ్లమూడి మధు, ఉప్పు శ్రీనివాసరావు, దోనే ప్రేమ్‌చంద్, కనపర్తి మోహన్‌రావు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు వైద్య పరికరాల వితరణ



గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా కళాశాల 1985 బ్యాచ్‌కు చెందిన పలువురు పూర్వ వైద్య విద్యార్థులు రూ.5 లక్షలు ఖరీదు చేసే పలు వైద్య పరికరాలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దాగంటి పద్మావతిదేవికి అందజేశారు. కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సేవలను డాక్టర్ పద్మావతిదేవి కొనియాడారు. డాక్టర్లు వి.వి.రామ్‌కుమార్, గంగాధర్, నాగరాజు, శివరామకృష్ణ, శైలజ పాల్గొన్నారు.

జనరిక్ మందులను ప్రోత్సహించాలి

- పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే సీఎం జగన్ లక్ష్యం
- 'జన ఔషధి దివస్'లో మంత్రి విడదల రజిని

మంగళగిరి: జనరిక్ మందులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. గుంటూరు జిల్లా ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జన ఔషధి దివస్ కార్యక్రమాన్ని మంత్రి రజిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఔషధ కంపెనీలు మార్కెటింగ్, పర్సంటేజీలను ఆశ చూపుతూ మందులను అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేస్తుంటాయని, వారి మాయలో ఎవరూ పడకూడదన్నారు. మందుల చీటీలపై రోగాలకు సంబంధించిన ఔషధాల పేరే రాయాలని చెప్పారు. రోగులంతా తక్కువ ధరకు లభించే జనరిక్ మందులను కొనుగోలు చేసేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఔషధ నియంత్రణ అధికారులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ అత్యంత సులువుగా, వేగంగా నాణ్యమైన వైద్యం పూర్తి ఉచితంగా అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్ లక్ష్యాలు, ప్రభుత్వ సంకల్పం నెరవేర్చేలా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు పని చేయాలన్నారు. జన ఔషధి దుకాణాల్లో 1,759 రకాల మందులు, 280 సర్జికల్ పరికరాలు లభిస్తున్నాయన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 145 జన ఔషధి కేంద్రాలు ఉన్నాయని, రానున్న రోజుల్లో మరిన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఔషధ నియంత్రణ శాఖ డీజీ రవిశంకర్ నారాయణన్, డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్, అధికారులు అనిల్, లక్ష్మణ్, రాష్ట్ర జన ఔషధి సమన్వయకర్త హరికృష్ణ, కళాశాల ప్రెసిడెంట్ సుందరి, సెక్రటరీ నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మిడ్‌డే మీల్స్ డైరెక్టర్ డాక్టర్ నిధిమీనా



మిడ్‌డే మీల్స్ డైరెక్టర్ డాక్టర్ నిధిమీనాను సన్మానిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ రామారావు

గుంటూరు రూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ డాక్టర్ నిధిమీనా తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నగర శివారుల్లోని లాంఫాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో లింగసమన్వయం కోసం సాంకేతిక ఆవిష్కరణలు అనే అంశంపై సదస్సు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా, పారిశ్రామికంగా, ఉద్యోగాలలో రాణిస్తున్నారని వివరించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మాట్లాడుతూ మహిళలు విశ్వవిద్యాలయంలో 40 శాతం పాలనా రంగంలో, ఉన్నత పదవుల్లో ఉన్నందుకు గర్వపడుతున్నామన్నారు. కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ సీహెచ్ చిరంజీవి మాట్లాడుతూ సమాజంలో తల్లిపాత్రకు అధిక ప్రాధాన్యం ఉందన్నారు. మహిళల సాధికారత దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మిడ్‌డే మీల్స్ డైరెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ మణి పాల్గొన్నారు.

మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు



విజ్ఞాన్ వర్సిటీలో మనోజ్ఞ మాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న అన్నపూర్ణ తదితరులు

- ఎస్ఈబీ సూపరింటెండెంట్ అన్నపూర్ణ
- విజ్ఞాన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

చేబ్రోలు: మహిళల్లోనే వైవిధ్యమైన నాయకత్వ లక్షణాలు ఉంటాయని గుంటూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ అన్నారు. మండలంలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ మహిళలు జీవితంలోను, సమాజంలోని సమస్యలపై గట్టిగా పోరాడాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బీ కరుణ మాట్లాడుతూ మహిళలు అవకాశాల కోసం ఎవరి కోసమో ఎదురుచూడొద్దని, విజ్ఞానం, నైపుణ్యం పెంచుకుంటే స్త్రీలు ఏదైనా సాధించవచ్చునన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. మేనేజ్‌మెంట్ స్టడీస్ డిపార్ట్‌మెంట్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ మీద రూపొందించిన ప్రత్యేకమైన 'మనోజ్ఞ' మ్యాగజైన్‌ను ఆవిష్కరించారు. వీసీ పీ నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ పాల్గొన్నారు.

13 నుంచి కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు నగరంలోని పోలీస్ పేరేడ్ మైదానంలో ఈనెల 13 నుంచి పోలీస్ కానిస్టేబుళ్ల అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ మంగళవారం మైదానంలో పర్యటించారు. పరుగు పందెం పోటీలు నిర్వహించేందుకు అనువుగా ఉండే స్థలాన్ని పరిశీలించారు. ఇతర పోటీల నిర్వహణపై పోలీస్ అధికారులతో చర్చించారు. అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురుష/మహిళా అభ్యర్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాల్సిన మౌలిక సౌకర్యాలపై చర్చించారు. మైదానంలో అక్కడక్కడ ఏపుగా పెరిగిన గడ్డిని తొలగించారు.

గంజాయి స్థావరాలపై పోలీసుల దాడులు

- ఇద్దరు అరెస్టు
- 2.3 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయితో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, సిబ్బంది

చీరాల: గంజాయి విక్రయించే స్థావరాలపై పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టి వరుస దాడులు చేస్తున్నారు. చీరాలలో ఒక్కరోజులోనే గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ సీఐ పీ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో సీఐ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కారంచేడు పోలీస్‌స్టేషన్ సమీపంలో నివాసం ఉండే కట్టా దుర్గాప్రసాద్ పట్టణంలోని ఉజిలీపేట కేంద్రంగా కొంతకాలంగా విద్యార్థులకు గంజాయి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అతనిపై కొద్దిరోజులుగా ప్రత్యేక నిఘా ఉంచి సోమవారం అర్ధరాత్రి దాడిచేసి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి అతని రిమాండ్ విధించింది.

రామకృష్ణాపురంలో..

వన్‌టౌన్ పరిధిలోని రామకృష్ణాపురంలో గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో వన్‌టౌన్ సీఐ ఆధ్వర్యంలో దాడులు జరిపారు. రామకృష్ణాపురానికి చెందిన రాగాల భద్రాది అదుపులోకి తీసుకుని విచారించగా అతని వద్ద 300 గ్రాముల గంజాయి దొరికింది. నిందితుడిని కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి అతనికి రిమాండ్ విధించింది.

పెట్టుబడులను ఆకర్షించడంలో ప్రభుత్వం సఫలం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- సమ్మిట్ విజయంతో సంబరాలు



ఎమ్మెల్యే కోన రఘుపతికి కేక్ తినిపిస్తున్న మహిళలు

బాపట్ల: పెట్టుబడిదారులను ఆకర్షించటంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఘన విజయం సాధించిందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. విశాఖపట్నంలో సమ్మిట్ విజయవంతం కావటంతో మంగళవారం స్థానిక గాయత్రీ అపార్టుమెంట్‌లో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పరిపాలనపై ఆకర్షితులైన పారిశ్రామికవేత్తలు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు వరుగులు తీశారని తెలిపారు. 352 ఎంఓయూలతో రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టేందుకు ముందుకురాటంతో ఎంతో శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ పరిశ్రమలు వస్తే ఆరు లక్షల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. రెండేళ్లలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రి నితీష్‌గడ్కరీ సైతం రూ.6,300కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటం గొప్పవిషయమన్నారు. గత ప్రభుత్వం 32వేల కోట్లు సమ్మిట్‌తో ముందుకు రాగా పరిశ్రమలు నెలకొల్పలేకపోగా వాటిని మన ప్రభుత్వం వచ్చాక ప్రారంభించామని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన, ఆర్థికాభివృద్ధితోనే పరిశ్రమల స్థాపనకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, నాయకులు దేజర్ల నారాయణరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, అంకమ్మరావు, నర్రా వెంకట్రావు, ఆదిలక్ష్మి, ఆట్ల ప్రసాదరెడ్డి, ఇగనలూరి మాల్యాద్రి, సోముల రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఇంటికి మరమ్మతులు చేయించేందుకు వస్తూ..

- రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి
- తండ్రీకుమారుడికి గాయాలు
- మృతులది బాపట్ల జిల్లా

మిర్యాలగూడ: రోడ్డు ప్రమాదంలో తల్లీకూతురు మృతి చెందగా తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలో చోటుచేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా పంగులూరు మండలం కొండమంజులూరు గ్రామానికి చెందిన బత్తుల అంకమరావు కుటుంబంతో కలిసి ఉపాధి కోసం కొన్నేళ్ల కిందట హైదరాబాద్‌లోని పలక్‌నూమాకు వలస వెళ్లాడు. కొంత నగదు జమ కావడంతో సొంత ఊరిలో తమ పాత ఇంటికి మరమ్మతులు చేయించుకుందామని బత్తుల అంకమరావు, అతని భార్య ఆదిలక్ష్మి(34), కూతురు ప్రశాంతి(11), కుమారుడు అనిల్‌తో కలిసి బైక్‌పై ఉదయం పలక్‌నూమా నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో సుమారు 11గంటల సమయంలో దామరచర్ల మండలం కొండ్రపోల్ వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో మిర్యాలగూడ నుంచి గుంటూరు వైపు వెళ్తున్న లారీ అతివేగంగా వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆదిలక్ష్మి, కూతురు ప్రశాంతిలు కుడి వైపు రోడ్డు మీద పడడంతో లారీ వారి తలల మీద నుంచి వెళ్లగా అక్కడికక్కడే మృతిచెందారు. ఎడమ వైపు మట్టిలో పడిన అంకమరావు, కుమారుడు అనిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన తండ్రి, కుమారుడిని, మృతిచెందిన ఆదిలక్ష్మి, ప్రశాంతిల మృతదేహాలను ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఏరియా ఆస్పత్రిలో బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతిచెందిన ప్రశాంతి ఇంటి వద్దనే ఉంటుండగా అనిల్ 5వ తరగతి చదువుతున్నాడు. మృతురాలు ఆదిలక్ష్మి తండ్రి పల్లపు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

సత్తెనపల్లిలో కర్ణాటక పోలీసుల దాడి



నిందితులను తీసుకువెళుతున్న పోలీసులు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో కర్ణాటక(బెంగళూరు) పోలీసులు మంగళవారం మెరుపు దాడి నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం గోగులపాడు గ్రామానికి చెందిన గోపసాని ఏడుకొండలు కొంత కాలంగా సత్తెనపల్లిలో నివాసం ఉంటున్నాడు. గత నెల 21న బెంగళూరులో ఇత్తడి చూపి బంగారంగా నమ్మించి రూ.13 లక్షలు చీటింగ్ చేసి పరారయ్యాడు. దీనిపై ఫిర్యాదు రావడంతో బెంగళూరు పోలీసులు విచారణ చేపట్టారు. ఆయన భార్య, ఒక కుమార్తె, అల్లుడు శివను పోలీసులు బెంగళూరులో అదుపులోకి తీసుకున్నారు. మరో కుమార్తె అద్దంకిలో ఉండటంతో ఆమెను అదుపులోకి తీసుకోవడంతో నగదు సత్తెనపల్లిలో ఉంచినట్లు నిర్ధారణ అయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు సోమవారం రాత్రి ఏడుకొండలు కుటుంబసభ్యులను వెంటపెట్టుకొని గోగులపాడు వచ్చారు. అక్కడ నగదు లేకపోవడంతో సత్తెనపల్లి వచ్చారు. మధ్యవర్తిగా వ్యవహరించిన దుర్గారావు బెంగళూరు పోలీసులతో మాట్లాడాడు. ఏడుకొండలు ఆచూకీ దొరకగానే చెబుతామని, రూ.8 లక్షలు నగదు ఉన్నాయని, వాటిని తీసుకొని మహిళలను వదిలి పెట్టమని కోరాడు. దీనికి పోలీసులు అంగీకరించారు. దుర్గారావు రూ.8 లక్షలు తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాడు. అనంతరం నిందితులను వదిలేది లేదని పోలీసులు అడ్డం తిరిగారు. స్థానికుల సమాచారంతో పట్టణ పోలీసులు రంగప్రవేశం చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బెంగళూరు పోలీసులకు రూ.8 లక్షలు అందించగా వారు నగదుతోపాటు ఏడుకొండలు కుటుంబసభ్యులను కూడా తీసుకొని వెళ్లారు. ఈ వ్యవహారం కలకలం రేపింది.

మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిని సన్మానిస్తున్న దృశ్యం

దాచేపల్లి : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన మహ్మదీయ మసీదును ఎండీ ఉస్మాన్ మేస్త్రితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా మంగళవారం ప్రారంభించారు. ముస్లిం మతపెద్దలు ప్రత్యేక నమాజ్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ జంగాను సన్మానించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాజకీయ, నామినేటెడ్ పదవుల్లో ముస్లిం, మైనార్టీలకు సమాన అవకాశాలు సీఎం జగన్ కల్పిస్తున్నారని, అన్ని విధాలుగా ముస్లిం, మైనార్టీలకు అండగా ఉన్నారన్నారు. గామాలపాడులో మసీదును నిర్మించటం సంతోషంగా ఉందని, ఖురాన్, బైబిల్, భగవద్గీత అందరూ సమానమేనని, అందరూ ఐక్యంగా ఉండాలని బోధిస్తున్నాయని చెప్పారు. సోదరభావంతో కలిసి మెలసి ఉండాలని, అల్లా చెప్పినట్లు ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలని అన్నారు. హైవే పక్కన నిర్మించిన ఈ మసీదుకు ఏపీ నుంచే కాకుండా పక్కనే ఉన్న తెలంగాణ నుంచి కూడా ముస్లింలు అధికంగా వచ్చే అవకాశం ఉందని, ప్రపంచంలో శాంతి వర్ధిల్లేలా ప్రతి ఒక్కరూ అల్లాను ప్రార్థించాలని కోరారు. తమ సొంత నిధులతో పలుచోట్ల షాదీఖానాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని పల్నాడు హాస్పిటల్ అధినేత డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఎండీ ఉస్మాన్ మేస్త్రి, జెడ్పీటీసీ సభ్యుడు జంగా వెంకట కోటయ్య, సర్పంచ్ జంగా సురేష్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి పురపాలక సంఘ కార్యాలయము

బహిరంగ వేలం ప్రకటన

ఆర్.ఓ.సి.నెం.106/2019/A1 తేది: 06.03.2023.

సత్తెనపల్లి పురపాలక సంఘ యాజమాన్యమునకు చెందిన, ఈ దిగువ నుదహరించిన మార్కెట్లలో, 2023-2024 ఆర్థిక సంవత్సరములో అనగా ది. 01-04-2023 నుండి 31-03-2024 వరకు (12 నెలలు) రుసుము/ఆశీలు వసూలు చేసుకొను హక్కుకై ది. 15-03-2023 బుధవారం ఉదయం గం.11.00 లకు మునిసిపల్ కార్యాలయములో మున్సిపల్ కమీషనరు గారిచే గాని లేదా వారిచే అనుమతి పొందిన వారిచే గాని అవసరమైన యెడల తదుపరి దినములలో బహిరంగ వేలము నిర్వహించబడును. మార్కెట్ గజిట్ నోటిఫికేషన్ నెం.5, తేది. 22-02-2023 నందలి షరతులు మరియు నిబంధనలకు లోబడి బహిరంగ వేలంపాట నిర్వహించబడును. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలయందు రెవిన్యూ విభాగము నందు అడిగి తెలుసుకొనవలెను.

వరుస సంఖ్య	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము(రూ.)	డాఖలు పరచవలసిన సాల్వెన్సీ మొత్తము(రూ.)	ప్రవేశ రుసుము మొత్తము (రూ.)
1	2	3	4	5
1.	రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.4,00,000/-	రూ.5,00,000/-	రూ.7,000/-
2.	సంతపేట మార్కెట్ రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.3,00,000 /-	రూ.4,00,000 /-	రూ.5,000/-
3.	జంతువధశాలలు రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.10,000 /-	రూ.20,000 /-	రూ.3,000/-
4.	మాంసము మరియు చేపల మార్కెట్ నందు రుసుము వసూలు చేసుకొనే హక్కు	రూ.15,000 /-	రూ.30,000 /-	రూ.3,000/-
5.	ప్రైవేట్ బస్ స్టాండ్ ఫీజులు వసూలు చేసుకొనే హక్కు	రూ.3,00,000 /-	రూ.3,00,000 /-	రూ.5,000/-

సం/- కె. షమ్మీ, కమిషనర్
సత్తెనపల్లి పురపాలక సంఘం